# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 18 నవంబర్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 92

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

సైబర్ నేరాలను అరికట్టేందుకు కఠిన చర్యలు



2లో..

## సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదం

డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న టూరిస్ట్ బస్సు

మంటలు చెలరేగడంతో 45 మంది మృత్యువాత

బతికి బయటపడ్డ ఒకే ఒక్కడు

మృతలంతా హైదరాబాద్ పాతబస్తీ వాసులు

మక్కాకు వెళుతుండగా ప్రమాదం



43 మంది హైదరాబాదీ ఉమ్రా యాత్రికుల సజీవ దహనం మరో ఇద్దరు కర్ణాటకవాసుల మృత్యువాతమక్కాను సందర్శించుకుని మదీనా వెళ్తుండగా దుర్ఘటన మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది ఈ నెల 9న నగరం నుంచి వెళ్లిన 54 మంది బస్సులో మదీనాకు బయలుదేరిన 46 మంది.. ఒక్కరు మినహా మిగతా వారంతా మృత్యువాత.. ఘోర ప్రమాదంతో హైదరాబాద్‌లో విషాదం..

# ‘పంచాయతీ పోరు’

## గ్రామపంచాయతీ ఎన్నికలు

- మార్చిలోగా ఎన్నికలు నిర్వహించకపోతే.. రూ.3 వేల కోట్ల కేంద్ర నిధులు మురిగిపోయే ప్రమాదం
- పార్టీపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం
- కోర్టుల తీర్పులు వచ్చాకే మిగతా స్థానిక సంస్థల ఎన్నికలు
- 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమిట్
- 9న తెలంగాణ దార్శనిక పత్రం విడుదల
- అందెశ్రీ కుమారుడికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం
- క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




హైదరాబాద్: పార్టీపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి.. గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. పంచాయతీలకు వచ్చే ఏడాది మార్చి ఆఖరులోగా ఎన్నికలు నిర్వహించకపోతే.. 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.3 వేల కోట్లు నిలిచిపోయే ప్రమాదమున్నందువల్ల... ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీలతో కలిసి పొంగులేటి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బీసీలకు 42% రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో కృషి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. “స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి గవర్నర్‌కు పంపితే అక్కడే ఆగిపోయింది. ఆర్డినెన్స్ తీసుకువస్తే హైకోర్టు స్టే విధించింది. సుప్రీంకోర్టుకు వెళ్తే... అక్కడ డిస్మిస్ అయింది. చిత్తశుద్ధితో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని ప్రయత్నం చేసినా కేంద్రం సహకారం లేదు. కోర్టుల్లోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్ణయం వచ్చింది. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోతే.. నిబంధనల ప్రకారం 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.3 వేల కోట్ల నిధులు వచ్చే మార్చితో మురిగిపోయే పరిస్థితి ఉంది. దీంతోపాటు గ్రామాల్లో పాలన వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతున్న నేపథ్యంలో.. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. డిసెంబరులోనే పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను క్యాబినెట్ ఆదేశించింది. ఇప్పుడు ఎన్నికలకు వెళ్లాలంటే.. 50% మించకుండా రిజర్వేషన్ల జాబితాను మరోసారి

డెడికేటెడ్ కమిషన్

నుంచి తెప్పించుకోవాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల సంఖ్యపై డెడికేటెడ్ కమిషన్ నుంచి నివేదిక కోరాలని మంత్రివర్గం తీర్మానించింది. వారం రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి... క్యాబినెట్ ఆమోదం పొందాలని సూచించింది. బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో తీర్పులు కొలిక్కి వచ్చిన తర్వాతే... ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని క్యాబినెట్ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన తర్వాత నిర్ణయించాం. రాష్ట్రానికి రావాల్సిన రూ.3 వేల కోట్లు వదులుకోవడం ఇష్టం లేక పంచాయతీ ఎన్నికలు మాత్రమే పెట్టాలని తీర్మానించాం.



2లో..

బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు

## ఉరిశిక్ష

అల్లర్లలో కాల్పులకు

ఆదేశించారన్న అభియోగం

ఢాకా ట్రిబ్యునల్ కోర్టు సంచలన తీర్పు

# రాష్ట్రపతికి చేరిన 16వ ఆర్థిక సంఘం నివేదిక



దిల్లీ: అరవింద్ పనగడియా నేతృత్వంలోని 16వ ఆర్థిక సంఘం 2026-31 మధ్యకాలానికి రాష్ట్రాలకు పంపిణీ చేసే ఆర్థిక వనరులకు సంబంధించిన నివేదికను సోమవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు అందజేసింది. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోగా దీనిని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. అప్పుడుగానీ రాష్ట్రాలకు ఎంత పన్నుల వాటా దక్కుతుందనే విషయం తెలియదు. జనాభా నియంత్రణను తాము బలంగా అమలు చేసినందున ఆ ప్రాతిపదికన కేటాయింపులు ఉండకూడదని దక్షిణాది రాష్ట్రాలన్నీ డిమాండు చేస్తూ వచ్చాయి. దాన్ని ఆర్థిక సంఘం ఎంతవరకు పరిగణనలోకి తీసుకుందన్న ప్రశ్న ఉదయిస్తోంది. కొత్త సిఫార్సులు 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. 2023 డిసెంబరు 31న 16వ ఆర్థిక సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2025 అక్టోబరు 31లోగా నివేదిక సమర్పించాలని గడువు విధించింది. తర్వాత దాన్ని నెలరోజులపాటు పొడిగించింది. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 42% వాటా పంపిణీ చేయాలని

14వ ఆర్థిక సంఘం సిఫార్సు చేయగా కేంద్ర ప్రభుత్వం దాన్ని యథాతథంగా అమలు చేసింది. 15వ ఆర్థిక సంఘమూ అదే విధానాన్ని బలపరిచింది. రాష్ట్రాలకు 41%, కొత్తగా కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పడిన జమ్మూకశ్మీర్‌కు 1% కలిపి మొత్తం 42% పన్నుల వాటా పంపిణీని సిఫార్సు చేయగా ఆ నివేదికనూ కేంద్రం అమలు చేసింది. ఇప్పుడు 16వ ఆర్థిక సంఘం ఏం సిఫార్సు చేసిందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.



2లో..

## గిగ్ వర్కర్లకు ఇక రక్షణ కవచం

వెట్టినుంచి విముక్తితో పాటు ఉద్యోగ భద్రత

సంక్షేమం, సామాజిక భద్రత లక్ష్యంగా బిల్లు

చర్చించి ఆమోడించిన తెలంగాణ కేబినేట్

గిగ్ కార్మికుల జీతాల చెల్లింపులో ఆలస్యం, మోసాలు, అకారణంగా అకౌంట్లు సస్పెండ్? చేయడం.. లాంటి సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ రిడ్రెసల్ అధికారులను నియమిస్తారు.



2లో..

సింగరేణి ఉద్యోగుల కోసం

## పోరాటం

డిపెండెంట్ ఉద్యోగాలను కాపాడుకోవాలి

డిసెంబర్ 13న సింఎండి కార్యాలయ ముట్టడి

ఖమ్మం జాగృతి బాటలో కవిత వెల్లడి




2లో..

ఐ బొమ్మ రవితో సినీ పరిశ్రమకు

## తీరని నష్టం

రవి హార్డ్ డిస్క్‌లో 21వేలకు పైగా సినిమాలు

బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసేలా పైరసీ

పైరసీ ద్వారా 20కోట్లు సంపాదించిన రవి

3 కోట్లు అకౌంట్‌లో ఫ్రీజ్ చేశామన్న సిపి సజ్జన్నార్

కమిషనర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన సినీ పెద్దలు

పదిమంది ఎమ్మెల్యేల

## అనర్హతపై విచారణ

స్పీకర్ తీరును తప్పుపట్టిన సుప్రీం

నాలుగు వారాల్లో నిర్ణయం ప్రకటించాలని ఆదేశం



2లో..

## బిజెపి గెలిస్తే ఇవిఎంల ట్యాంపర్

మీరు గెలిస్తే ప్రజాస్వామ్యబద్ధమా

జూబ్లీహిల్ ఓటమితో కుంగిపోయేది లేదు

కాంగ్రెస్ విమర్శలపై మండిపడ్డ ఈటెల రాజేందర్



2లో..

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

## సింగరేణి ఉద్యోగుల కోసం పోరాటం



ఖమ్మం: డిపెండెంట్ ఉద్యోగాలు కాపాడుకోలేని స్థితిలో ఇప్పుడు ఉన్నామని జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ 13న సింగరేణి సీఎండీ కార్యాలయాన్ని ముట్టడి చేయబోతున్నామని ఖమ్మం జిల్లాలో జాగృతి బాటలో కవిత ప్రకటించారు. సింగరేణి ఉద్యోగం ఒక కుటుంబానికి ఇన్సూరెన్స్ లాంటిదని... డిపెండెంట్ ఉద్యోగాల కోసం పోరాటం చేస్తామన్నారు. సోమవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సింగరేణిలో కార్మికులతో కవిత మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా మెడికల్ బోర్డ్ కోసం కొట్లాడుతున్నామన్నారు. సింగరేణి గని కార్మికులకు ఇన్‌కమ్ ట్యాక్స్ కట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని.. 'మీకోసం పోరాటం చేసే మాకు అండగా ఉండాలి అని కోరుతున్నాం' అని కవిత అన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు వేలం వేయడాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం సింగరేణికి అక్షరాలా రూ.40 వేల కోట్ల అప్పు ఉందని తెలిపారు. సింగరేణి కార్మికుల కోసం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేయాలని కోరుతున్నామన్నారు. ఆసుపత్రి నిర్మాణం చేసే లోపు కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు పెర్మినెంట్ అయ్యేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. బొగ్గు బావిలోకి దిగే ముందు మైసమ్మకు మొక్కుకుని జాగ్రత్తగా ఉండాలని కవిత సూచించారు.

## పదిమంది ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ

న్యూఢిల్లీ:- తెలంగాణ స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము తీసుకోవాలా ? అని సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్‌ను ప్రశ్నించింది. ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కోర్టుధిక్కర పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోక పోవడంపై కేటీఆర్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం విచారణ జరిగింది. కోర్టుధిక్కారంపై నాలుగు వారాల్లోగా జవాబు చెప్పాలని స్పీకర్‌కి దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్. గవాయి ధర్మాసనం విచారణ జరిపింది. మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడం కోర్టు ధిక్కారమే.. రోజువారీగా విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయి స్పష్టం చేశారు. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని స్పీకర్ తరపున న్యాయవాదులు అభిషేక్ సింగ్, ముకుల్ రోహత్గి వెల్లడించారు. తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఈలోపు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేల అనర్హత అంశానికి సంబంధించి దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లు సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. ఆ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా భారత రాష్ట్ర సమితి దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జులై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది.
అయితే విభిన్న కారణాలవల్ల ఆలోపు నిర్ణయం తీసుకోవడం సాధ్యం కానందున స్పీకర్‌కు మరో రెండునెలలు గడువు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ శాసనసభ కార్యదర్శి దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ సీజేఐ ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ అయింది. ఈక్రమంలో ఆయా పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది.

## గిగ్ వర్కర్లకు ఇక రక్షణ కవచం

హైదరాబాద్: తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సోమవారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ
భేటీలో 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ -ఆధారిత గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం బిల్లు-2025'పై చర్చించిన అనంతరం బిల్లుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. గిగ్ వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించింది. కేబినెట్ ఆమోదం పొందిన ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే దేశంలోనే తొలిసారిగా సమగ్ర గిగ్ వర్కర్ల చట్టం తెచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుంది. ఇకపై గిగ్ వర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రామిక వర్గంగా గుర్తిస్తుంది.
ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 3 లక్షల నుంచి 4 లక్షల వరకు గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం రవాణా (మొబిలిటీ), డెలివరీ, లాజిస్టిక్స్ రంగాల్లో పనిచేస్తున్నారు. వీరు సాధారణంగా వారానికి 7 రోజుల పాటు రోజుకు 10 నుంచి-12 గంటల చొప్పున వర్క్ చేస్తున్నారు. వీరి ఆదాయంలో ప్లాట్‌ఫామ్‌లు 20 నుంచి 30శాతం వరకు కమిషన్‌గా వసూలు చేస్తున్నాయి. ఈ క్రమంలో వారికి స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేకుండాపోవడం ప్రధాన సమస్యగా ఉంది. తాజా బిల్లులో గిగ్ వర్కర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రంగా 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ -ఆధారిత గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ బోర్డు' పేరుతో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయనుంది. ఈ బోర్డు గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సంక్షేమ పథకాల అమలు, నిధుల పర్యవేక్షణ బాధ్యతలు చేపడుతుంది.
అగ్రిగేటర్లకు చెల్లించే సొమ్ములో 1-2 శాతం వాటాను గిగ్ వర్కర్ల సంక్షేమ నిధికి మళ్లించనున్నారు. దీనికి తోడు ప్రభుత్వం తరఫున సీఎస్ఆర్ ఫండ్స్, విరాళాలు, గ్రాంట్లను ఈ నిధికి అందజేస్తుంది. ప్లాట్‌ఫామ్‌ల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయా? లేదా? అనేది పర్యవేక్షించేందుకు రియల్-టైమ్ 'వెల్ఫేర్ ఫండ్ ఫీ వెరిఫికేషన్ సిస్టమ్ అందుబాటులోకి తేనున్నారు. స్విగ్గీ, జొమాటో, జెప్టో, ఉబర్, ఓలా వంటి ప్లాట్ ఫామ్‌లు, కార్మికుల మధ్య తలెత్తే వివాదాలను ఇన్‌టైంలో పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెసల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ముసాయిదాలో పొందుపరిచింది. ఇందులో భాగంగా గిగ్ కార్మికుల జీతాల చెల్లింపులో ఆలస్యం, మోసాలు, అకారణంగా అకౌంట్లు సస్పెండ్? చేయడం.. లాంటి సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ రిడ్రెసల్ అధికారులను నియమిస్తారు. 100 మందికి పైగా కార్మికులు ఉండే ప్రతి పెద్ద ఎ÷-లాట్‌ఫామ్‌లో 'అంతర్గత వివాద పరిష్కార కమిటీ'ని తప్పనిసరిగా ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. ఈ కమిటీల ద్వారా పరిష్కారం లభించకపోతే, పైస్థాయిలో అప్పీలేట్ అథారిటీకి వెళ్లే అవకాశం ఉంటుంది. ఇందుకోసం బిల్లులో ప్రత్యేక నిబంధనలు పొందుపరిచారు. కార్మికులు లేదా ఎ÷-లాట్‌ఫామ్‌లు గ్రీవెన్స్ అధికారులు ఇచ్చిన నిర్ణయంపై సంతృప్తిచెందకపోతే వారు అప్పీలేట్ అథారిటీని ఆశ్రయించే అవకాశం ఉంది. ఈ అథారిటీ స్వతంత్రంగా విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకోనుంది. తద్వారా కార్మికులకు న్యాయపరమైన భరోసా దక్కుతుంది. చట్టం అమల్లోకి వస్తే ఆయా ప్లాట్‌ఫామ్‌లు ఇకపై ఉద్యోగులను అకారణంగా తొలగించలేవు. ఎవరైనా ఉద్యోగిని తొలగించాలంటే కనీసం ఏడు రోజుల ముందు నోటీసు ఇవ్వడం తప్పనిసరి.

# బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఉరిశిక్ష

### అల్లర్లలో కాల్పులకు ఆదేశించారన్న అభియోగం

### ఢాకా ట్రైబ్యునల్ కోర్టు సంచలన తీర్పు



ఢాకా: ఢాకా అల్లర్లకు కారణమంటూ బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి కోరటు ఉరిశిక్ష విధించింది. దశాబ్దాల పాటు ఆ దేశ రాజకీయ చరిత్రను తానై నడిపించిన ఆమెను 'ఉక్కు మహిళ'గా వ్యవహరిస్తుంటారు. కానీ, తన హయాంలో ఏర్పడ్డ ట్రైబ్యునలే.. ఇప్పుడు ఆమెకు మరణశిక్ష విధించింది. ఇటీవలి అల్లర్ల తరవాత ఆమె భారత్‌లో ఆశ్రయం పొంది ప్రవాస జీవితం గడుపుతున్నారు.
ఆమె ప్రభుత్వం అసమ్మతిని అణచివేసిందని, మీడియాపై ఆంక్షలు విధించిందని, ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసిందని, భద్రతా శక్తుల అధికారాలను పెంచిందనే ఆరోపణలు వచ్చాయి. 2024లో స్వాతంత్య పోరాట వీరుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థి నిరసనలు చివరికి దేశవ్యాప్త తిరుగుబాటుగా మారాయి. ఈ నిరసనలే హసీనా పాలనను అంతం చేశాయి. ఆమె ప్రభుత్వం చేపట్టిన భద్రతా చర్యల వల్ల హింస పెరిగింది. ఇది జులై తిరుగుబాటుగా మారింది. ఈ అల్లర్లలో 1,400 మంది వరకు మరణించారని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నివేదించింది. ఆందోళనల కారణంగా హసీనా అధికారం నుంచి వైదొలగి భారత్‌లో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. అనంతరం బంగ్లాలో మహ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడ్డ మధ్యంతర ప్రభుత్వం 'అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ 'ను పునరుద్ధరించింది. యుద్ధ నేరాలకు పాల్పడిన వారిని విచారించేందుకు ఆమే ఒకప్పుడు దీన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు అదే ట్రైబ్యునల్ 2024 నాటి అల్లర్ల విషయంలో హసీనాపై మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాల ఆరోపణలు మోపింది. నెలల తరబడి విచారణ జరిపి సోమవారం మరణశిక్ష విధించింది. తన ఎదుగుదలకు తోడ్పడిన దేశమే ఇప్పుడు తన పతనాన్ని శాసించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు హసీనా. భారత ఆశ్రయంలో ఉంటూ సరిహద్దు ఆవల ఉన్న బంగ్లాదేశ్ భవిష్యత్తుపై మథనపడుతున్నారు. తనకు విధించిన మరణ శిక్షను ఖండించారు. తీర్పు మోసపూరితమన్నారు. అక్కడి ప్రభుత్వమే కుట్రపూరితంగా తనకు శిక్ష పడేలా చేసిందని ఆవేదన చెందారు. తనను తాను నిరూపించుకోవడానికి కోర్టు అవకాశం ఇవ్వలేదని వాపోయారు. నాటి తూర్పు పాకిస్థాన్‌లోని తుంగిపారాలో 1947 సెప్టెంబరు 28న షేక్ హసీనా జన్మించారు. తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ ఆ దేశ స్వాతంత్య్ర పోరాటంలో కీలకంగా వ్యవహరించి జాతిపితగా నిలిచిపోయారు. ఢాకా విశ్వవిద్యాలయం నుంచి బెంగాలీ సాహిత్యంలో హసీనా మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ సమయం లోనే విద్యార్థి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1968లో అణు శాస్త్రవేత్త ఎం.ఎ.వాజెద్ మియాను వివాహం చేసుకున్నారు. రాజకీయాలకు భిన్నంగా ఆయన విద్యావేత్తగా నిరాడంబర జీవితం గడిపారు. 2009లో ఆయన మరణించే వరకు ఆమెకు తోడుగా ఉన్నారు. వారికి సజీబ్ వాజెద్ జాయ్ అనే కొడుకు, సైమా వాజెద్ పుతుల్ అనే కూతురు ఉన్నారు. 1975 ఆగస్టులో జరిగిన సైనిక తిరుగుబాటు హసీనా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ ఘర్షణల్లో ఆమె తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులు ఇంకా కుటుంబ సభ్యులు హత్యకు గురయ్యారు. ఆ సమయంలో విదేశాల్లో ఉండటం వల్ల హసీనా, ఆమె చిన్న చెల్లెలు రెహానా మాత్రమే బతికి బయటపడ్డారు. నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీ ఆమెకు ఆశ్రయం ఇచ్చారు. ఆరు సంవత్సరాల తర్వాత 1981 మేలో బంగ్లాదేశ్‌కు హసీనా తిరిగొచ్చారు. దేశానికి రాకముందే ఆమెను అవామీ లీగ్ పార్టీ తమ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. దేశానికి తిరిగి వచ్చే సరికే హసీనా ప్రధాన ప్రత్యర్థి ఖలీదా జియా ఆమె కోసం వేచి చూస్తున్నారు. హత్యకు గురైన అధ్యక్షుడు జియావుర్ రెహమాన్ భార్యే ఈ ఖలీదా. వీరిద్దరే తమదైన సిద్ధాంతాలు, పోరాటాలతో మూడు దశాబ్దాల పాటు బంగ్లాదేశ్ రాజకీయ చరిత్రను రచించారు. హసీనా మొదటిసారి 1996లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. 2001లో అధికారం కోల్పోయారు. 2008లో భారీ విజయం సాధించి సుదీర్ఘ పాలన మొదలుపెట్టారు. 2014, 2018 ఎన్నికల్లోనూ అవామీ లీగ్ పార్టీయే గెలిచింది. దీంతో ప్రపంచంలోనే ఎక్కువ కాలం పాలించిన మహిళా నేతల్లో ఒకరిగా చరిత్ర సృష్టించారు. ఆమె పాలనలో బంగ్లాదేశ్ చాలా వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించింది. పద్మా వంతెన వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి. పేదరిక నిర్మూలనలో దేశం పురోగమించింది. బంగ్లాదేశ్ ప్రపంచ వస్త్ర పరిశ్రమకు కేంద్రంగా మారింది. ఈ ప్రశంసలతో పాటే విమర్శలు కూడా ఎదుర్కొన్నారు.

# ఐ బొమ్మ రవితో సినీ పరిశ్రమకు తీరని నష్టం

హైదరాబాద్: పైరసీతో సినీ పరిశ్రమకు భారీ నష్టం కలిగిందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ అన్నారు. పైరసీని అరికట్టే క్రమంలో ఐ బొమ్మ రవిని అరెస్ట్ చేశామన్నారు. ఐ బొమ్మ రవిపై మూడు పైరసీ కేసులున్నాయని తెలిపారు. రవి.. వెబ్ సైట్ డిజైన్, డెవలపింగ్‌లో ఆరితేరాడని, సీక్రెట్ కెమెరాలతో కొత్త సినిమాలను పైరసీ చేస్తాడని తెలిపారు. దమ్ముంటే పట్టుకోండి అంటూ పోలీసులకు ఛాలెంజ్ చేసిన ఐ బొమ్మ రవి ప్రస్తుతం జైల్లో ఊచలు లెక్కపెడుతున్నాడు. రవి అరెస్ట్‌పై సీపీ సజ్జనార్ సినీ ప్రముఖులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పైరసీపై సంచలన విషయాలు బయటపెట్టారు. ఐ బొమ్మ రవి హార్డ్ డిస్క్ లలో దాదాపు 21 వేలకు పైగా సినిమాలు ఉన్నాయని తెలిపారు. పైరసీ ద్వారా రవి రూ. 20 కోట్లు సంపాదించాడని, అందులో రూ. 3 కోట్లు ఫ్రీజ్ చేశామని చెప్పారు. రవికి ఇంటర్నేషనల్ లింక్స్ ఉన్నాయని, ఈ కేసు చేధించేందుకు జాతీయ స్థాయి సంస్థల సహకారం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఐ బొమ్మ రవి దగ్గర 50 లక్షల మంది సమాచారం ఉందని వెల్లడించారు. డేటా కలెక్షన్ కోసం ఐ బొమ్మ రవి మాస్టర్ మైండ్ ఉపయోగించాడని సీపీ వివరించారు. ఒక సైట్‌ను బ్లాక్ చేస్తే.. మరో సైట్‌ను డెవలప్ చేస్తాడని వెల్లడించారు. రవి సైట్ ఓపెన్ చేయగానే బెట్టింగ్ యాప్స్ అట్రాక్ట్ చేస్తాయని, బెట్టింగ్ యాప్స్‌తో జనం వేల కోట్లు నష్టపోయారని వ్యాఖ్యానించారు. కస్టడీకి ఇస్తే ఐ బొమ్మ రవి నుంచి పూర్తి వివరాలు రాబడుతామని, ఆయన నెట్‌వర్క్‌లో ఉన్న మిగతా వారిని కూడా అరెస్ట్ చేస్తామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇదిలావుంటే సోమవారం హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో సినీ పెద్దలు భేటీ అయ్యారు. అగ్ర కథానాయకులు చిరంజీవి, నాగార్జునలతో పాటు దర్శకుడు రాజమౌళి, నిర్మాత దిల్‌రాజు, దగ్గుబాటి సురేశ్ ఈ భేటీలో పాల్గొన్నారు. ఇటీవల పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సినీపెద్దలు సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. పైరసీతో సినీ రంగానికి చాలా నష్టం జరిగిందని తెలిపారు. దీన్ని కట్టడి చేయడంలో భాగంగా ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతడిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. పైరసీకి సంబంధించి అంతకు ముందు ప్రశాంత్, శివరాజ్‌ను కూడా అరెస్టు చేశాం. ఇమ్మడి రవి సమాజానికి చాలా నష్టం చేకూర్చాడు. పైరసీ ద్వారా నష్టం చేయడమే కాకుండా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నాడు.
దీంతో చాలా మంది చనిపోయారు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే కొత్త సైట్‌ను తయారు చేశాడు. ఇలా65 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహించాడు. 21 వేల సినిమాలు అతడి హార్డ్ డిస్క్‌లో ఉన్నాయి.

# సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదం



హైదరాబాద్: సౌదీ అరేబియాలో ఘోర విషాద ఘటన చోటుచేసుకుంది. మదీనాకు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాదీలు మృతిచెందారు. యాత్రికులతో వెళ్తోన్న బస్సు.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సౌదీ అరేబియాలో సోమవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మదీనాకు సమీపంగా భారీ రోడ్డు ప్రమాదం సంభవించింది. మక్కా నుంచి మదీనా వెళుతున్న యాత్రికుల బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పెద్ద దుర్ఘటన చోటుచేసుకుంది. ఈమంటల్లో హైదరాబాద్‌కు చెందిన 45 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపిన వివరాల ప్రకారం 54 మంది యాత్రికుల బృందం నవంబర్ 9 న హైదరాబాద్ నుంచి జెడ్డాకు బయలు దేరింది. నవంబర్ 23 వరకు టూర్‌ను ప్లాన్ చేశారు. వారిలో నలుగురు ముందుగానే కారులో మదీనాకు వెళ్లగా, మరో నలుగురు మక్కాలోనే నిలిచిపోయారు. మిగిలిన 46 మంది బస్సులో ప్రయాణం కొనసాగించారు. మదీనా నుండి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో బస్సు చమురు ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఒక్కసారిగా అగ్నిప్రమాదం చెలరేగిందని తెలిపారు. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనగానే మంటలు చెలరేగి బస్సు మొత్తం వ్యాపించాయి. ప్రమాద సమయంలో యాత్రికులంతా నిద్రలో ఉండటంతో మృతుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంలో అబ్దుల్ షోయబ్ అనే యాత్రికుడు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డాడు. అతను ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరణించిన వారిలో మల్లేపల్లి, బజార్‌ఘాట్, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల వారూ ఉన్నట్లు తెలుస్తోంది. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 1.30 గంటల సమయంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. యాత్రికులంతా నిద్రలో ఉండడం వల్ల మరణాలు అధికంగా నమోద య్యాయని అధికారులు
భావిస్తున్నారు. ప్రమాద స్థలంలో రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాలోని జెడ్డా భారత దౌత్య కార్యాలయం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. 24 ఏళ్ల మొహమ్మద్ అబ్దుల్ షోయబ్ డ్రైవర్ పక్కన కూర్చోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. షోయబ్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి. గాయాల పాలైన షోయబ్‌ను హాస్పిటల్‌లో చేర్చారు. అయితే అతడి
ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం బయటకు రాలేదు . ప్రమాదంలో షోయబ్ కుటుంబ సభ్యులందరూ చనిపోయినట్టు తెలుస్తోంది.

## బిజెపి గెలిస్తే ఇవిఎంల ట్యాంపర్

హైదరాబాద్:ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం సహజమే అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గెలిచినా, ఓడినా.. అధికారం ఉన్నా, లేకపోయినా దశాబ్దాలుగా కాషాయ జండా పట్టుకుని ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అన్నారు. గెలిస్తే బీజేపీ వాళ్ళు ఈవీఎంలను ఏదో చేశారని అంటున్నారు. మరి జూబ్లీహిల్స్ ఎన్నికలో ఈవీఎం మేనేజ్ చేశారా?, దొంగ ఓట్లు నమోదు చేయించారా?. తెలంగాణలో, కర్ణాటకలో కూడా మీరే గెలిచారు, మరి అక్కడ కూడా అలానే చేశారా?. మీరు గెలిస్తే ఒక న్యాయం.. మేము గెలిస్తే ఓట్ చోరీ అని అంటారా?. ఏం చేస్తావో ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలి, ఇలాంటి ఆరోపణలు కాదు. బరిగీసి కొట్లాడే తత్వం లేనప్పుడు పార్టీ ముందుకు పోయే అవకాశం లేదు. అధికార పార్టీ హంగుల వల్ల ఉపఎన్నికల్లో గెలుస్తుంది. పార్టీ అంటే నాయకులు అందరూ బాధ్యత తీసుకుంటారు. కిషన్ రెడ్డి గారినో, ఇంకొకరినో బాధ్యులు చెయ్యలేం. జూబ్లీహిల్స్ లో ఎమ్మెల్యే చనిపోయిన వెంటనే బీజేపీ తిరిగి ఉంటే ఫలితం వేరుగా ఉండేదన్నారు. వేలాది మంది బీజేపీ కారకర్తలు, వందల మంది నాయకుల భవిష్యత్తు కోసం మాట్లాడుతున్నా.. సీఎం, మంత్రులు, కొంతమంది అవగాహన లేని నాయకులు మాట్లాడుతున్న మాటలు వింటున్నా అని ఎంపీ ఈటల చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. బీజేపీ కార్యకర్తల్లారా.. జూబ్లీహిల్స్ ఎన్నిక ఓడిపోగానే కుంగిపోవద్దని, భవిష్యత్తు మనదే అని అన్నారు. తెలంగాణలో డివిజన్ పాలిటిక్స్‌తో అధికారం లోకి రాలేమని.. కులం, మతం పునాది మీద రాజకీయాలు శాశ్వతంగా నడవవన్నారు. 'నారాయణఖేడ్, పాలేరు హుజూర్నగర్, నాగార్జున సాగర్, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అన్నిటిలో అధికార పార్టీ గెలిచింది. కేసీఆర్ అహంకారం అణచడానికి దుబ్బాకలో బీజేపీని గెలిపించారు. అన్యాయానికి న్యాయానికి.. ఆత్మగౌరవానికి అహంకారానికి.. ధర్మానికి అధర్మానికి జరిగిన హుజురాబాద్ ఎన్నికల్లో ధర్మం గెలిచింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరూ ఆ ఎన్నిక కోసం ఎదురుచూశారు. స్వయంగా కేసీఆర్ వచ్చి దళితబంధు ప్రకటించినా గెలవలేకపోయారు. తెలంగాణ వచ్చిన తరువాత 9 ఉప ఎన్నికలు జరిగితే.. 7 సార్లు అధికార పార్టీనే గెలిచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో గెలిచింది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో అధికార పార్టీ అనేక ప్రలోభాలు పెట్టి మరీ గెలిచారు. కేసీఆర్ ఎన్ని చేశారో వీరు కూడా అవే చేశారు. కాంగ్రెస్ పార్టీకి హుజురాబాద్ లో వచ్చిన ఓట్లు 3016. దుబ్బాకలో, మునుగోడు డిపాజిట్ కోల్పోయింది. మరి డిపాజిటు కోల్పోయిన పార్టీ మొన్న ఎలా అధికారంలోకి వచ్చింది. ఒక్క బై ఎలక్షన్ ఓడిపోగానే బీజేపీ పని అయిపోతుందా?. రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారు ఎవరూ అలా మాట్లాడరు' అని ఎంపీ ఈటల అన్నారు. 'బీహార్ ఎన్నికలు ఒక ప్రభంజనం. ఒళ్ళు వంచి పని చేస్తే విజయం మనదే. కార్యకర్తలు, నాయకులు సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు చూసి బాధపడకండి. భవిష్యత్తు మనదే. జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితం అందరం బాధ్యత తీసుకుంటున్నాం.ప్రజలకు సేవ చేయడం వల్లనే దేశ వ్యాప్తంగా బీజేపీకి ప్రజలు ఓట్లు వేస్తున్నారు.

# సైబర్ నేరాలను అరికట్టేందుకు కఠిన చర్యలు

### సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులపై అప్రమత్తం

### డిజిటల్ అరెస్టలను నివారించేందుకు చైతన్యం

### ప్రజల్లోకి విస్తృతంగా సైబర్ సురక్ష స్లోగన్

### విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు



విజయవాడ: సైబర్ నేరాలను అరికట్టేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. నేరగాళ్లు కొత్త ఎత్తులు వేస్తున్నారని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు తెలిపారు. డిజిటల్ అరెస్ట్ నేరాలను నివారించేందుకు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వివరించారు. సైబర్ సురక్ష అనే స్లోగన్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి.. సైబర్ నేరగాళ్ల ఆట కట్టిస్తామని ఆయన సోమవారం విజయవాడలో ప్రకటించారు. పోలీసుల పరంగా తీసుకునే చర్యల వల్ల నేరగాళ్లు తప్పించుకో కూడదని పేర్కొన్నారు. జీరో టోలరెన్స్ టూ క్రైం, సైబర్ క్రైం అని సీఎం చంద్రబాబు చెబుతుంటారని.. ఎటువంటి పరిస్థితుల్లో డిజిటల్ అరెస్టులు జరగకూడదని పేర్కొన్నారు. నెల రోజుల పాటుసైబర్ సురక్షా అనే కార్యక్రమం తీసుకుని.. దానిని ప్రారంభిస్తున్నామని తెలిపారు. 226 బ్యాంకులలో అవగాహన తీసుకు వచ్చేందుకు 226 టీంలు, బ్యాంకు ఉద్యోగులతో కలిసి.. ఖాతాదారుల్లో మార్పు తీసుకు వస్తామన్నారు. ఉన్నతస్థాయిలో దీనిపై సమావేశం ఏర్పాటు చేసి ప్రణాళికలు కూడా సిద్ధం చేశామని తెలిపారు. ఒక చిన్న అప్లికేషన్ కూడా రూపొందించామని.. దీనిని చదివితే ప్రతి ఒక్కరికీ అర్థమవుతుందని చెప్పారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, ప్రజల్లో అవగాహన తీసుకొచ్చే విధంగా సైబర్ సురక్షా పేరుతో నెల రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సైబర్ నేరాలు వివిధ రూపాలలో జరుగుతున్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వారి కదలికలపై దృష్టి పెట్టి దొంగలను పట్టుకుంటున్నామని పేర్కొన్నారు. చైన్ స్నాచర్స్, బైక్ దొంగలు, గంజాయికి బానిసలుగా మారి చోరీ
చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ తరహా చోరీలను అరికడుతున్నామని తెలిపారు. తాము తీసుకున్న చర్యల వల్ల నలభై శాతం నేరాలు తగ్గాయని వివరించారు. ఎప్పుడూ లేని విధంగా 80 శాతం రికవరీతో విజయవాడ పోలీసులు ముందున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలను గత ఏడాది కంటే ఈ ఏడాది 92 మందికి తగ్గించగలిగామన్నారు. వీటిపై సిబ్బందికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ చురుగ్గా పని చేసేలా చేస్తున్నామని వివరించారు. దాతల సహకారంతో ప్రతి ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. పది వేల సీసీ కెమెరాలు.. డాష్ బోర్డులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సైబర్ క్రైమ్ నేడు పెను సవాల్‌గా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లితేనే.. ఈ తరహా నేరాలను నిరోధించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సైబర్ సిటిజన్ అమల్లోకి తీసుకు వచ్చామని.. భవిష్యత్తులో మంచి ఫలితాలు ఉంటాయని విజయవాడ నగర సీపీ రాజశేఖర్ బాబు ఆశా భావం వ్యక్తం చేశారు. ÷-యాంకర్స్‌తో పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరగాళ్లు కరెంట్ అకౌంట్లు ఏర్పాటు చేసి.. ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. సేవింగ్స్ నుంచి కరెంట్ అకౌంట్‌గా మార్చే ప్రతి ఖాతాను తప్పకుండా పరిశీలించాలని సూచించినట్లు తెలిపారు. ఈ సైబర్ నేరాలపై అవగాహన కోసం ఫామ్ ప్లేట్లు సైతం ముద్రించి.. వారితో చదివించడం ద్వారా అవగాహనకు తీసుకువస్తున్నామన్నారు. అక్కడక్కడా కొంతమంది బ్యాంక్ సిబ్బంది నిర్లక్ష్యంతో నేరాలు జరుగు తున్నాయని పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టులు చాలా వరకు నిరోధించగలిగామని ఎన్టీఆర్ జిల్లా పోలీసులుగా తాము గర్వంగా చెబుతున్నామన్నారు. సైబర్ ప్రాస్టర్స్‌ను కచ్చితంగా కట్టడి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నగర సీపీ రాజశేఖర్ బాబు స్పష్టం చేశారు. ఇన్వెస్టిమెంట్ మోసాలు కూడా బాగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తుందని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తులు ఆసక్తికరంగా చేసే ప్రకటనలు నమ్మి రూ. లక్షల్లో నగదు పోగొట్టుకున్నారని వివరించారు. ఈ ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్ నివారణ కోసం పెద్ద యుద్ధమే చేయాల్సి ఉంటుందన్నారు.
వీటిని నివారించేందుకు
ఎలా ముందుకు సాగాలనే దానిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ప్రాపర్టీ క్రైం నిరోధించడంలో పై చేయి సాధించినా.. వైట్ కాలర్ క్రైం, సైబర్ క్రైంలను నిరోధించాల్సి ఉందని పేర్కొన్నారు. అందులో పోలీస్ సిబ్బందికి అన్ని విధాలా శిక్షణ ఇస్తున్నామన్నారు. సైబర్ క్రిమినల్స్‌కు తప్పకుండా ముక్కుతాడు వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాల్ సెంటర్ అరాచకాలపై దృష్టి పెడతామని నగర సీపీ రాజశేఖర్ బాబు స్పష్టం చేశారు.

వేగుచుక్క

# ప్రభుత్వ ఉపాధ్యాయులకు అలర్ట్..

**వారం రోజుల వ్యవధిలో అన్ని ప్రభుత్వ స్కూళ్లలో ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ పూర్తి స్థాయిలో అమలు**



తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలల్లో పారద్శకత పెంచేందుకు.. విధులకు ఆలస్యంగా రావడం, డుమ్మాలు కొట్టే ఉపాధ్యాయులకు చెక్ పెట్టడం కోసం ప్రభుత్వం కొత్త రూల్ అమలు చేయనుంది. టీచర్ల హాజరు నమోదు కోసం ఫేస్ రికగ్నేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆగస్టు 1 నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రారంభమై, వారం రోజుల్లో అన్ని పాఠశాలల్లోనూ ఈ విధానం అమలు కానుంది. ఇకపై ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణ నుంచే ఉదయం, సాయంత్రం హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే విద్యార్థుల హాజరుకు సంబంధించి ఈ విధానం అమలవుతోంది.

సర్కార్ బడుల్లో విధులకు డుమ్మా కొట్టడం.. ఆలస్యంగా వచ్చే టీచర్లకు భారీ షాకిచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం రెడీ అయ్యింది. టీచర్ల హాజరుకు సంబంధించి ప్రభుత్వం కొత్త సిస్టమ్‌ను అమలు చేయనుంది. అదే ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ విధానం(ఎఫ్ఆర్ఎస్). ఆగస్టు 1నుంచి సర్కార్ బడుల్లో దీన్ని అమల్లోకి తీసుకువస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పారదర్శకతకు పెద్ద పీట వేసేందుకు తెలంగాణ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. దీని అమలుకు సంబంధించి.. ఇప్పటికే జిల్లా విద్యాశాఖాధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 1 నుంచి ఇది ఎంపిక చేసిన పాఠశాలల్లోనే అమల్లోకి వస్తుండగా.. వారం రోజుల వ్యవధిలో అన్ని ప్రభుత్వ స్కూళ్లలో ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ పూర్తి స్థాయిలో అమలు చేయనున్నారు.

ఈ విధానంలో.. ఉపాధ్యాయులు పని చేస్తున్న పాఠశాల ప్రాంగణం నుంచే వారి హాజరు వివరాలు అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం జియో కోఆర్డినేట్ అటెండెన్స్ అమలు కానుంది. దీనిలో భాగంగా టీచర్లు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్కూల్ ఆవరణ నుంచే లాగిన్, లాగౌట్ అవుతూ.. హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల తరచుగా స్కూళ్లకు దుమ్మాలు కొట్టే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకునేందుకు అవకాశం లభించనుంది. ఇప్పటికే విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ హాజరు ప్రక్రియ అమలవుతుండగా నేటి నుంచి టీచర్లకు కూడా ఇదే విధానంలో హాజరు ప్రక్రియ అమలు కానున్నది.

సర్కార్ బడిలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కొత్తగా రూపొందించిన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని వల్ల ఆ రోజు క్లాస్‌కి ఎంత మంది విద్యార్థులు వచ్చారు.. మొత్తం పాఠశాలకు ఎంత మంది హాజరయ్యారు.. ఏ సమయంలో హాజరు తీశారు అనే వివరాలు నేరుగా ప్రభుత్వానికే తెలియనున్నవి. ఈ విధానం అమలు వల్ల మధ్యాహ్న భోజనం నిర్వహణ పారదర్శకంగా అమలు కొనసాగుతుంది.

ఇటీవల ఇదే యాప్‌లో స్టాఫ్ అనే విభాగాన్ని యాడ్ చేసి.. కొద్దిరోజుల పాటు ట్రయల్ నిర్వహించారు. ఇక ఆగస్టు 1నుంచి టీచర్లకు కూడా ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని ఆదేశాలు రావడంతో విద్యాశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. ఈ విధానంలో ప్రతి టీచర్ పాఠశాలకు వచ్చినప్పుడు.. తిరిగి వెళ్లేటప్పుడు తప్పకుండా ముఖం ఆధారంగా హాజరు నమోదు చేయాలి. దీని వల్ల టీచర్ల హాజరు మెరగవుతుందని భావిస్తున్నారు. నేటి నుంచి అనగా ఆగస్టు 1 నుంచి ఇది అమల్లోకి రానుంది.

## 40 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలంటూ ప్రభుత్వానికి లేఖ




తెలంగాణ: కేంద్రం ఓబీసీ జాబితాలో 40 కులాలను చేర్చాలంటూ రాష్ట్రం బీస కమిషన్ ఛైర్మన్.. కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం చర్చనీయాంశమైంది. మరి దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి. అలానే రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు సాధ్యం అవుతుందా లేదా అన్నదానిపై ఇంకా క్లారిటీ రాలేదు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల అంశంపై వాడీవేడి చర్చ సాగుతోంది. స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ.. రూపొందించిన బిల్లులను తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాల కోసం పెంచిన రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ దిశగా పంచాయతీరాజ్ చట్టం, 2018కి సవరణలు చేయాలని నిర్ణయించి.. తగిన ఆర్డినెన్సు ముసాయిదాను సిద్ధం చేసింది. దీన్ని గవర్నర్ ఆమోదం కోసం పంపారు.

బీసీల రిజర్వేషన్ అంశం ఓ కొలిక్కి వస్తే.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు మార్గం సుగమం అవుతోంది. ప్రస్తుతం బీసీల రిజర్వేషన్లపై కేంద్రం, రాష్ట్రంలో జోరుగా చర్చ సాగుతోంది. ఇదిలా ఉంటే.. మరో 40 కులాలాను ఓబీసీ జాబితాలో చేర్చాలంటూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం సంచలనంగా మారింది. తెలంగాణంలో అదనంగా ఉన్న 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలంటూ బీసీ కమిషన్ చైర్మన్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం సంచలనంగా మారింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటయిన తర్వాత రాష్ట్ర బీసీ జాబితాలో 112 కులాలు ఉండేవని బీసీ కమిషన్ చైర్మన్ తెలిపారు. అయితే 2016లో కేంద్రం విడుదల చేసిన ఓబీసీ జాబితాలో మాత్రం 90 కులాలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. ఆ తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం.. మరో 17 కులాలను బీసీ జాబితాలో చేర్చింది. దీంతో తెలంగాణలో మొత్తం బీసీ కులాల సంఖ్య 130కి చేరాయని తెలిపారు. అయినా ఇప్పటికి కూడా కేంద్ర ఓబీసీ జాబితాలో 90 కులాలే ఉన్నాయని... మిగతా ఈ 40 కులాలను ఇంకా చేర్చలేదని ఆయన వెల్లడించారు.

ఈ క్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ గురువారం కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రి వీరేంద్ర కుమార్‌కు లేఖ రాశారు. ఈ 40 కులాలను కేంద్రం ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరారు. కొత్త కులాల చేర్పు అంశంపై.. రాష్ట్ర ప్రభుత్వం 2016 నుంచి కేంద్రాన్ని కోరుతోందని గుర్తు చేశారు. గతంలో 2021 డిసెంబర్‌లో, 2023 సెప్టెంబర్‌లో జాతీయ బీసీ కమిషన్ విచారణలు జరిగాయని.. అయినా కేంద్రం ప్రభుత్వం మాత్రం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. తెలంగాణలో కొన్ని రోజుల క్రితం 26 కులాలను బీసీ జాబితాలో చేర్చాలనే డిమాండ్ తెర మీదకు వచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీసీ కులాల జాబితా నుండి తొలగించిన 26 కులాలపై.. బీసీ కమిషన్ చేపట్టిన విచారణ చేపట్టడంతో ఈ అంశం తెర మీదకు వచ్చింది. రాష్ట్ర వెనుకబడిన తరగతుల జాబితా నుంచి కొన్ని కులాల తొలగింపు అంశంలో.. బీసీ కమిషన్ బహిరంగ విచారణను నిర్వహించింది.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో గిరిజనులకు సీట్లు..




హైదరాబాద్: హైదరాబాద్‌లో బెస్ట్ స్కూల్ అంటే అందరికి ముందుగా గుర్తుకు వచ్చేది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ . ప్రస్తుతం సమాజంలో ఉన్న ఎందరో సినీ, రాజకీయ, ఇతర రంగాలకు చెందిన సెలబ్రిటీలు.. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివిన వారే. దీనిలో సీటు సంపాదించడం అంత తేలిక కాదు. అయితే ఇది కార్పొరేట్ స్కూల్ అయినప్పటికీ.. బలహీన వర్గాల వారి పిల్లలకు కూడా అడ్మిషన్లు ఇస్తుంది. దీనిలో భాగంగా బేగంపేట, రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 2025-25 సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో ప్రవేశానికి గిరిజన పిల్లల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆర్.కోటాజి గురువారం ప్రకటించారు.

ఈ కోటాలో మొత్తం ఆరు సీట్లు ఉండగా.. బాలురకు 4, బాలికలకు 2 సీట్లు కేటాయించినట్లు ఆర్ కోటాజి తెలిపారు. ఇందులో ఉపకులాల వారీగా విభజిస్తే.. లంబాడాలకు 2, ఎరుకలకు 1, ఇతర గిరిజన తెగలకు 3 సీట్లను రిజర్వ్ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక లాటరీ పద్ధతి ద్వారా జరుగుతుందని తెలిపారు.

**అర్హులు, దరఖాస్తు విధానం..**

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో సీటు పొందాలనుకునే వారు హైదరాబాద్ జిల్లాకు చెందిన వారై ఉండాలి. అలానే దరఖాస్తు చేసే చిన్నారి 2018 జూన్ 1 నుంచి 2019 మే 31 మధ్య జన్మించి ఉండాలి. అభ్యర్థుల తల్లిదండ్రుల ఏడాది ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. దీనికి దరఖాస్తు చేసుకోవాలని భావించిన వారు.. ఈ నెల 8 లోపు లక్డికాపూల్‌లోని కలెక్టరేట్‌లో అప్లికేషన్లు ఇవ్వాలని కోటాజి వెల్లడించారు.

అలాగే ఎస్సీ కులాల వారు కూడా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతి అడ్మిషన్ల దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వీరు నాంపల్లి చంద్ర విహార్‌లోని ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఆఫీసులో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు త్వరపడాలని.. విద్యార్థుల ఎంపిక లాటరీ పద్ధతిలో జరుగుతుందని తెలిపారు. ఇదిలా ఉంటే రేవంత్ సర్కార్.. బేగంపేట, రామంతా పూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్స్‌లో అడ్మిషన్స్ పొందే గిరిజన విద్యార్థులకు రెండు హాస్టళ్లు మంజూరు చేస్తూ జీవో జారీ చేసిన సంగతి తెలిసిందే. బేగంపేట, రామంతాపూర్ రెండు చోట్ల ఒక్కోటి చొప్పున బాల బాలికలకు వేరు వేరుగా ఈ హాస్టళ్లు నిర్మిస్తున్నారు. అది కూడా వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో హాస్టల్స్ నిర్మాణం కోసం ప్రభుత్వం కోటిన్నర రూపాయల వరకు ఖర్చు చేయనుంది.

## హైవే విస్తరణకు ప్రతిపాదనలు..

తెలంగాణ: రోడ్డు మార్గాల అభివృద్ధిలో భాగంగా, గండి మైసమ్మ నుండి మెదక్ వరకు ఉన్న 675డీ జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు ప్రతిపాదనలు రెడీ చేస్తున్నారు అధికారులు. ప్రస్తుతం రెండు లేన్లుగా ఉన్న ఈ హైవేని ఫోర్ లేన్‌గా విస్తరిస్తే.. ఈ మార్గంలో రద్దీ తగ్గడమే కాకుండా ప్రమాదాలు కూడా తగ్గుతాయని భావిస్తున్నారు.రద్దీని దృష్టిలో పెట్టుకుని పలు జిల్లాల్లో హైవేలను విస్తరించడం, బైపాస్ రోడ్ల నిర్మాణం, కొన్నింటిని ఫోర్ లేన్లుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటుంది. ఈక్రమంలో తాజాగా ఓ జిల్లాలోని హైవే విస్తరణకు ప్రతిపాదనలు చేశారు. దీన్ని ఫోర్ లేన్‌గా మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం టూ లేన్‌గా ఉన్న నేషనల్ హైవే 675డీ ని ఫోర్ లేన్‌గా విస్తరించేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. హైదరాబాద్ శివారు గండి మైసమ్మ నుంచి మెదక్ వరకు 4 లేన్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు చేశారు. త్వరలోనే దీని విస్తరణ పనులకు కేంద్రం నుంచి ఆమోదం వస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావ్ ప్రకటించారు.

హైవేని విస్తరించడంతో పాటుగా, బైపాస్ రోడ్డుకు ఆమోదం లభించి.. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఈ మార్గంలో ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందంటున్నారు. హైద్రాబాద్ బాలానగర్ నుంచి నర్సాపూర్ మీదుగా మెదక్ టౌన్‌కి గతంలో సింగి ల్ రోడ్డే ఉండేది. అయితే ఈ మార్గంలో వాహనాల సంఖ్య పెరగడంతో స్టేట్‌హైవేగా ఉన్న ఈ రోడ్డును 2017-18లో నేషనల్ హైవేగా మార్చారు. అయితే మెదక్ జిల్లాలో పర్యాక ప్రాంతాలు ఎక్కువగా ఉండటం.. పక్కనే బోధన్, బాన్సువాడ డిపోల ఆర్టీసీ బస్సులు అధికంగా ఈ రూట్లోనే రాకపోకలు సాగిస్తుండ టంతో రద్దీ విపరీతంగా పెరిగింది. పైగా దీన్ని కొంత మేర మాత్రమే 4 లేన్ రోడ్డుగా విస్తరించి, డివైడర్ ఏర్పాటు చేశారు.

## ఇందిరమ్మ ఇళ్లు రద్దు చేసిన అధికారులు..

తెలంగాణ: ఆగస్టు 15 నాటికి పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఒకేసారి పెద్ద సంఖ్యలో గృహ ప్రవేశం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. అధికారులు 1,950 మంది ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేశారు. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించేందుకు ప్రభుత్వం ఎంత పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నా.. కొన్ని చోట్ల అనర్హులకు ఇళ్లు దక్కుతు న్నాయి. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న తప్పులతో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నట్లు అధికారులు గుర్తించారు. హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో 1,950 మంది అనర్హులు ఇందిరమ్మ ఇళ్లు పొందినట్లు వెల్లడైంది. బెస్‌మెంట్ పూర్తయిన తరువాత.. మొదటి విడతలో భాగంగా రూ. లక్ష చెల్లించే సమయంలో ఈ 1,950 మంది అనర్హులను గుర్తించారు. దీనిపై హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ మాట్లాడుతూ.. వెంటనే వీరికి మంజూరు చేసిన ఇండ్లను రద్దు చేసి.. వీరికి బదులు కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు బాధ్యులైన సెక్రటరీలను సస్పెండ్ చేశాలని తెలిపారు. ఈ పథ కానికి సంబందించి మొదడి విడతలో.. సొంత జాగా ఉండి ఇల్లు లేని వారికే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నామని ఏండీ గౌతమ్ తెలిపారు. తనిఖీల్లో అనర్హులుగా గుర్తించిన ఈ 1,950 మంది గతంలోనే ఇంటి నిర్మాణం ప్రారంభించి.. బెస్‌మెంట్ వరకు నిర్మించి వదిలేసిన వారని తెలిపారు. పంచా యతీ సెక్రటరీలు వీరి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి దశల వారీగా పలువురు అధికారులు.. ఆపై కలెక్టర్ ఆమోదం తెలిపిన తర్వాతే లబ్ధి దారులకు బిల్లులు చెల్లి స్తున్నామని అన్నారు. అయినప్పటికీ కొన్ని చోట్ల తప్పులు జరిగి.. అనర్హులు కూడా ఇళ్లు పొందారని వెల్లడించారు.

## పగలు రూ.50.. రాత్రి రూ.100..

తెలంగాణ: ఆర్టీసీ ప్రయాణికులకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా మరో బస్సుల్లో ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రాత్రిపూట ప్రయాణించేవారికి రూ.100, పగటిపూట ప్రయాణించేవారికి రూ.50 చొప్పున ఛార్జీలు పెరిగాయి. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ఈ పెరిగిన ఛార్జీలు వర్తించనున్నవి. ఇదివరకే బస్ పాస్ ఛార్జీలను పెంచిన ఆర్టీసీ, ఇప్పుడు పుష్పక్ బస్సుల్లోనూ పెంచడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా ఈ ధరల పెంపు గురించి ఆర్టీసీ నుంచి ఉలాంటి ప్రకటన లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఆ బస్సుల్లో ఛార్జీల పెంపు..**

ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ వరుస షాకులిస్తుంది. కొన్ని రోజుల క్రితమే బస్ పాస్ ఛార్జీలను పెంచింది. వీటిని 20 శాతం మేర పెంచుతూ టీజీఎస్‌ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. సాధారణ ప్రజలతోపాటు స్టూడెంట్ పాస్ ధరలను సైతం పెంచుతూ నిర్ణయం తీసుకుని సామాన్యుల జేబుకు చిల్లు పెట్టింది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో బస్ పాస్ కోసం సామాన్యులు సుమారు 2 వేల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేసినా లాభం లేకుండా పోయింది. బస్ పాస్ ఛార్జీల పెంపు నిర్ణయంపై ఆర్టీసీ వెనక్కి తగ్గలేదు. ఇదిలా ఉండగానే తాజాగా మరోసారి ఛార్జీల పెంపు నిర్ణయంతో వార్తల్లో నిలిచింది ఆర్టీసీ.

పుష్పక్ బస్సుల్లో ప్రయాణించే వారికి టీజీఎస్‌ఆర్టీసీ భారీ షాక్ ఇచ్చింది. వీటిల్లో




ప్రయాణించే వారి వద్ద నుంచి రాత్రిపూట రూ. 100, పగటి పూట రూ. 50 ఛార్జీలు పెంచి ప్రయాణికుల జేబుకు చిల్లు పెడుతున్నట్లు తెలుస్తోంది. పుష్పక్ బస్సుల్లో సామాన్యులు ప్రయాణించారు. ఇవి నగరంలో పలు ప్రాంతాల నుంచి విమానాశ్రయానికి ప్రయాణికులను చేర వేస్తాయి. అయితే తాజాగా ఈ పుష్పక్ బస్సుల్లో ఛార్జీలు పెంచడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితమే తెలంగాణ ఆర్టీసీ.. బస్ పాసుల ధరతో పాటు 24 టికెట్ ఛార్జీలు పెంచి ప్రయాణికులకు భారీ షాకిచ్చింది. ఇదిలా ఉండగా.. తాజాగా ఎయిర్‌పోర్టు రూట్లలో నడిచే పుష్పక్ బస్సులో ఏకంగా రూ. 100 పెంచి.. ప్రయాణికులను నిలువుదోపిడి చేస్తుంది. అది కూడా పగటి వేళ ఒక రకంగా.. రాత్రి పూట ఒకరకంగా ఛార్జీలు వసూలు చేస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. పుష్పక్ బస్సుల్లో ప్రయాణించే వారి వద్ద ఉదయం 6 నుంచి రాత్రి 9.55 గంటల వరకు రూ.350 ఛార్జీ వసూలు చేస్తున్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు పుష్పక్ బస్సుల్లో ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లేఒక్కో ప్రయాణికుడికి రూ. 450 ఛార్జీ వసూలు చేస్తున్నారు. పైగా ఈ పెంపు గురించి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే ఆర్టీసీ బస్ ఛార్జీలను పెంచుతోందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రయాణికులను ఆకర్షించడం కోసం టీజీఎస్‌ఆర్టీసీ పలు రూట్లలో టికెట్ ధరలపై డిస్కౌంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. హైదరాబ్షాద్ నుంచి బెంగళూరు, విజయ వాడ మార్గాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. భాగ్యనగరం నుంచి విజయవాడ, బెంగళూరు రూట్లలో వెళ్లే బస్సు టికెట్లపై భారీ డిస్కౌంట్ ప్రకటించింది.



## గ్రేటర్ వరంగల్ పరిధిలో కొత్త పార్కులు..

తెలంగాణ: రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వరద నీరు వృథాగా పోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని అధికారులు వరదల నియంత్రణకు స్పాంజ్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని ముంపు సమస్య అధికంగా ఉండటంతో.. రహదారులు, లోతట్టు ప్రాంతాల్లోని వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రతిపాదనలు పంపినట్లు సీడీఎంఏ టీకే. శ్రీదేవి ఆదేశించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో.. వరద నీరు వృథాగా పోకుండా అధికారులు కీలక చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని అధికారులు వరదల నియంత్రణకు 'స్పాంజ్ పార్కులను' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో ముంపు సమస్య ఎక్కువగా ఉన్నందున, రహదారులు, లోతట్టు ప్రాంతాల్లోని వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడానికి ఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు సీడీఎంఏ టీకే. శ్రీదేవి ఆదేశాలు జారీ చేశారు.

**స్పాంజ్ పార్కుల ఆవశ్యకత..**

స్పాంజ్ పార్కులు అనే ఆలోచన చెన్నై నగరం నుంచి ప్రేరణ పొందింది. సుమారు 11 ఏళ్ల క్రితం చెన్నై నగరాన్ని వరదలు తీవ్రంగా ముంచెత్తాయి. రహదారులు, కాలనీలు, విమానాశ్రయం పూర్తిగా నీట మునిగి ఐదు, ఆరు రోజుల పాటు జనజీవనం స్తంభించింది. ఈ అనుభవం నుంచి పాఠాలు నేర్చుకొని, వరద ముంపును తగ్గించడానికి చెన్నైలో 57 స్పాంజ్ పార్కులను ప్రతిపాదించగా, ప్రస్తుతం 21 పార్కులు నిర్మాణ దశలో ఉన్నాయి.

స్పాంజ్ పార్కులు అనేక ప్రయోజనాలను అందిస్తాయి.. వాటిలో వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా వరదల తీవ్రతను గణనీయంగా తగ్గిస్తాయి. ఈ పార్కులలో నిల్వ ఉన్న నీరు భూమిలోకి ఇంకి, భూగర్భ జలాల మట్టాన్ని పెంచుతుంది, తద్వారా వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడిని అధిగమించవచ్చు. ఈ పార్కులను పచ్చదనంతో నిండిన ప్రాంతాలుగా అభివృద్ధి చేయవచ్చు.. ఇది నగరంలో పచ్చదనాన్ని పెంచడానికి దోహదపడుతుంది. అంతే కాకుండా.. ఈ పార్కుల నిర్మాణం తక్కువ ఖర్చుతో కూడుకున్నది.. కానీ ఎక్కువ ప్రయోజనాలను అందిస్తుంది.

**గ్రేటర్ వరంగల్ ప్రణాళికలు..**

గ్రేటర్ వరంగల్ పరిధిలో 45 లోతట్టు ప్రాంతాలు.. అలాగే వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 25 ప్రధాన రహదారులకు తరచుగా వరద ముంపు సమస్య ఉంది. ఇలాంటి ప్రాంతాల్లోనే స్పాంజ్ పార్కులు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకురాలు ఆదేశించారు. వరంగల్, హనుమకొండలోని కొన్ని కీలక ప్రాంతాలు, ఇక్కడ స్పాంజ్ పార్కులను ఏర్పాటు చేయాలని ఇంజినీర్లు సూచిస్తున్నారు. కాజీపేట ఎన్ఐటీ, హనుమకొండ వడ్డేపల్లి సెంటర్, అదాలత్ సెంటర్, నక్కలగుట్ట, కేయూసీ కూడలి, హనుమకొండ చౌరస్తా, అలంకార్, వరంగల్‌లో ములుగురోడ్, ఎంజీఎం సెంటర్, కాశీబుగ్గ, వరంగల్ అండర్‌బ్రిడ్జి, హంటర్‌రోడ్, పాపయ్యపేట వంటి ప్రాంతాల్లో వీటిని నిర్మించున్నట్లు తెలుస్తోంది. నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఇప్పటికే స్పాంజ్ పార్కు తరహాలో భారీ ఇంకుడు గుంత నిర్మాణం జరుగుతోంది. ఇది 9/5 అడుగుల పొడవు, 6/4 అడుగుల వెడల్పుతో 228 క్యూబిక్ మీటర్ల లోతు ఉంటుంది. ఇలాగే హసన్‌పర్తి, చింత గట్టు, టేకులగూడెం, తరాలపల్లి విలీన గ్రామాల్లో కూడా ఇలాం టి ప్రాజెక్టులు మొదలయ్యాయి. ఈ నమూనాను అనుస రించి, వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో స్పాంజ్ పార్కుల ఏర్పా టుకు తగిన స్థలాలను గుర్తించాలని కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. ఈ చర్యలతో వర్షాకాలంలో ప్రజలకు వరద కష్టాలు తీరుతాయని అధికారులు ఆశిస్తున్నారు.

## వర్సిటీకి మరో ఇంజనీరింగ్ కళాశాల మంజూరు..

తెలంగాణ: ఈ సంవత్సరం ఇంజినీరింగ్ ప్రవేశాలు కోరుకునే విద్యార్థులకు ఇది నిజంగా గుడ్ న్యూస్ అనే చెప్పాలి. ప్రస్తుతం రాష్ట్రంలో మొదటి, రెండో విడత ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ పూర్తవ్వగా.. ఎప్‌సెట్‌లో విద్యార్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా సీట్లను కేటాయించారు. తుది విడత కౌన్సెలింగ్ ఆగస్టు 5వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా.. దీని కోసం విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీనితో పాటు బీ కేటగిరీ సీట్లకు కూడా నోటిఫికేషన్ విడుదల కావడంతో వాటిలో చేరేందుకు కూడా విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు.

**తెలంగాణలో ఇంజినీరింగ్ సీట్ల సంఖ్య..**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 300కు పైగా ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల కింద నడుస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి లెక్కల ప్రకారం, సుమారు 171 ఇంజినీరింగ్ కళాశాలల్లో 1,07,218 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇదిలా ఉండగా.. నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లిలో ఉన్న తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఒక కొత్త ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన జీవో జారీ చేసింది. ఈ కొత్త కళాశాల ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26) నుంచే తన కార్యకలాపాలను ప్రారంభిస్తుంది. ఇందులో 4 బీటెక్ కోర్సులను ప్రవేశపెట్టేందుకు అనుమతిచ్చారు. ఆ కోర్సులు.. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ, డేటా సైన్స్.

ఈ ప్రతి కోర్సులోనూ 60 సీట్లు ఉంటాయి. దీనికి అదనంగా.. ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనుకబడిన వర్గాల) కోటా కింద మరో 10 శాతం, అంటే 24 సీట్లు కలుస్తాయి.

వేగుచుక్క



# తన ఫోటోలతో ఫేక్ సోషల్ అకౌంట్లు

సైబర్ మోసాలపై నటి అదితి రావు హైదరీ ఆందోళన నటి అదితి రావు హైదరీ సోషల్ మీడియాలో తన పేరుతో జరుగుతున్న మోసాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పలు దేశీయ, పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న అదితి, పెళ్లి తర్వాత కూడా తన క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపిస్తూనే ఉంది. తరచూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆమె, తాజాగా వాట్సాప్‌లో తన ఫోటోలను ఉపయోగిస్తూ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తున్నారని వెల్లడించారు. అదితి షేర్ చేసిన స్క్రీన్‌షాట్‌లో, ఒక వ్యక్తి ఆమె పేరు, ఫోటోలను ఉపయోగిస్తూ ఫోటోగ్రాఫర్లకు ఫోటోషూట్ల పేరుతో మెసేజులు పంపుతున్నట్లు కనిపించింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఇన్‌స్టాగ్రామ్‌లో క్లారిటీ ఇస్తూ అభిమానులను అప్రమత్తం చేశారు.ఈ రోజు కొంతమంది నాకు చెప్పిన విషయాన్ని మీతో పంచుకుంటున్నాను. వాట్సాప్‌లో నా ఫోటోలను ఉపయోగిస్తూ ఎవరో 'ఫోటోషూట్' కోసం మెసేజులు పంపుతున్నారు. అవి నేను పంపినవి కావు. నేను ఎప్పుడూ నా పర్సనల్ నంబర్‌ను వర్క్ కోసం ఉపయోగించను. నా అధికారిక పనులు అన్నీ నా టీమ్ ద్వారానే జరుగుతాయి. అలాంటి మెసేజులు వస్తే వెంటనే నా జీసతఞనీనిని।ఞబి టీమ్‌కి తెలియజేయండి. నాకు ఎప్పుడూ అండగా నిలిచే అభిమానులకు ధన్యవాదాలు, అని అదితి పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవల పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియా ఫేక్ అకౌంట్లతో మోసాలకు గురవుతున్న సందర్భంలో, ఇప్పుడు అదితి పేరు, ఫోటోలతో కూడా మోసగాళ్లు దోపిడీకి ప్రయత్నాలు చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అభిమానులు, ఫోటోగ్రాఫర్లు ఇలాంటి నకిలీ మెసేజులను నమ్మవద్దని ఆమె స్పష్టం చేశారు.




# డిసెబర్ 25న దండోరా

విలక్షణ నటులు శివాజీ, నవదీప్, నందు, బిందు మాధవి కాంబోలో తెరకెక్కిన చిత్రం 'దండోరా' . రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. అన్నికార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 25న థియేటర్లకు వచ్చేందుకు రెడీ అయింది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా సోమవారం ఉదయం ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే ఫక్తు తెలంగాణ మాండలికంలో వ్యంగ్యంగా తెరకెక్కించిన చిత్రంగా తెలుస్తోండగా, ముఖ్యంగా నాలుగు పుస్తకాలు చదివి లోకమంతా తెలిసినోడి లెక్క మాట్లాడకు... నీకు తెలియని లోకం ఇంకోటి ఉంది అంటూ సాగే డైలాగులు, సన్నివేశాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. మీరూ ఓ లుక్కేయండి. గతంలో నేషనల్ అవార్డ్ దక్కించుకున్న చిత్రం 'కలర్ ఫోటో',ఆపై నవ్వులు పూయించిన 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ 'దండోరా' చిత్రాన్ని నిర్మించారు. మురళీ కాంత్ దర్శకత్వం వహించాడు. మార్క్ కె. రాబిన్ సంగీతం అందించాడు.



# గోవాలో 20న అంతర్జాతీయ చలనచిత్రోత్సవం

ఆరంభ వేడుకల్లో బాలయ్యకు సన్మానం

ఒకప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో తెలుగు వారికి సరైన ప్రాధాన్యత లభిస్తుండేది కాదు. కానీ ఇప్పుడు కాలం మారింది. యావత్ భారత సినీ రంగం తెలుగు వారివైపు ఆసక్తిగా చూస్తున్నాయి. తెలుగు సినిమాలే ఇవాళ జాతీయ స్థాయిలో దిశా నిర్దేశర చేస్తున్నాయి. అంతర్జాతీయ యవనికపై భారతీయ సినిమా సత్తాను చాటుతోంది కూడా తెలుగు సినిమాలే! ఈ నేపథ్యంలో తెలుగు సినిమా రంగానికి చెందిన కథానాయకులకు, దర్శకులకు అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో తగిన గుర్తింపు లభిస్తోంది. ఆ మధ్య మెగాస్టార్ చిరంజీవిని ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ వేదికపై ఘనంగా సత్కరించారు. ఇప్పుడు నందమూరి బాలకృష్ణను సత్కరించబోతున్నారు. నవంబర్ 20న గోవా లో 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ప్రారంభం కానుంది. ఈ ఆరంభ వేడుకల్లోనే బాలకృష్ణను ఘనంగా సత్కరించబోతున్నారు. ఐదు దశాబ్దాల పాటు నందమూరి బాలకృష్ణ తెలుగు సినిమా రంగంలో హీరోగా రాణిస్తున్నారు. నందమూరి తారక రామారావు నట వారసుడిగా తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టిన బాలకృష్ణ మడమ తిప్పకుండా యాభై సంవత్సరాలు ముందుకు సాగుతున్నారు. ఎన్నో బ్లాక్ బస్టర్స్ ను తన ఖాతాలో వేసుకున్నారు. తెలుగు సినిమా రంగానికి ఆయన చేసిన సేవల కారణంగా ఈ సత్కారం జరుగబోతోంది. కేంద్ర ప్రభుత్వ అత్యున్నత గౌరవాల్లో ఒకటైన పద్మభూషణ్ పురస్కారాన్ని సైతం బాలకృష్ణ ఇటీవల అందుకున్నారు. కేవలం నటుడిగానే కాకుండా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్‌గా క్యాన్సర్ చికిత్స, పరిశోధన రంగంలో బాలకృష్ణ విశేష సేవలను అందిస్తున్నారు. అదేవిధంగా, మూడు సార్లు హిందూపురం ఎమ్మెల్యేగా ప్రజాసేవలో పదేళ్లకు పైగా కీలక పాత్ర పోషిస్తున్నారాయన.



# వచ్చే ఏడాది పెళ్లి పీటలు ఎక్కబోతున్నా

తిరుమలలో నటుడు సాయిదుర్గతేజ్

వెల్లడిమెగా మేనల్లుడు సాయి దుర్గ తేజ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం విఐపీ బ్రేక్‌లో ఆయన స్వామిని సేవించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఏడాది తన పెళ్లి జరుగుతుందని క్లారిటీ ఇచ్చారు. ఎన్నో రోజులుగా పెళ్లిపై వస్తున్న రూమర్లకు చెక్ పెట్టారు తేజ్.
'చక్కని సినిమాలు, మంచి జీవితం ఇచ్చిన భగవంతుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు తిరుమల వచ్చాను. కొత్త సంవత్సరం వస్తున్న తరుణంలో శ్రీవారి ఆశీస్సులు కావాలని దర్శించుకున్నాను. వచ్చే ఏడాదిలో నేను నటించిన 'సంబరాల ఏటిగట్టు' విడుదలవుతుంది. ప్రేక్షకులు, అభిమానులు ఆదరిస్తారని ఆశిస్తున్నా' అన్నారు. పెళ్లిపై వస్తున్న రూమర్లపై ఓ జర్నలిస్ట్ ప్రశ్నించగా.. 'వచ్చే ఏడాదిలోనే నా పెళ్లి ఉంటుంది' అని సమాధానమిచ్చారు తేజ్. 'సంబరాల ఏటిగట్టు' చిత్రాన్ని రోహిత్ కె.పి. తెరకెక్కిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. 'తన జీవితంలో చాలా ముఖ్యమైన సినిమా ఇదని, అందరి అంచనాల్ని అందుకునేలా కష్టపడుతున్నానని సాయితేజ్ ఇటీవల ఓ వేదికపై తెలిపారు.


# హీరోగా ఎంట్రీ ఇస్తున్న రమేశ్ బాబు తనయుడు



ఘట్టమనేని కుటుంబం నుంచి మూడో తరం హీరో ఎంట్రీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సూపర్ స్టార్ మహేష్ బాబు సోదరుడు దివంగత రమేష్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన అజయ్ భూపతి ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతుండగా, సినిమా నుంచి మరో ఆసక్తికర అప్డేట్ బయటకు వచ్చింది.ఈ చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ అధికారికంగా కన్ఫర్మ్ అయ్యింది. ఇది ఆమెకు తొలి తెలుగు చిత్రం. ఈ సందర్భంగా టీం ప్రత్యేక పోస్టర్ విడుదల చేస్తూ రషాకు గ్రాండ్ వెల్‌కమ్ చెప్పింది. కొద్ది రోజులుగా ఆమె నటిస్తుందంటూ ప్రచారం జరుగుతుండగా, సోమవారం విడుదలైన పోస్టర్‌తో దీనికి అధికారిక క్లారిటీ వచ్చింది. 'ఏః4' పేరుతో ప్రచారం జరుగుతున్న ఈ ప్రాజెక్ట్ నవంబర్ నెలలోనే రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనుంది. బాలీవుడ్‌లో రషా అరంగేట్రం చేసియగా, అప్పుడు 'ఆజాద్' సినిమాలో ఒకే ఒక్క స్పెషల్ సాంగ్‌తోనే ఆమె ఓవర్‌నైట్ స్టార్ అయింది. ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్‌మెంట్‌లు, స్క్రీన్ ప్రెజెన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇప్పుడు అదే జోష్‌తో తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.జయకృష్ణ ఘట్టమనేనిని న్యూ ఏజ్ లవ్ స్టోరీతో ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నారు. తిరుపతి ? చిత్తూరు నేపథ్యంతో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్ కూడా ఈ విషయాన్నే స్పష్టం చేసింది. ఈ చిత్రం తెలుగు సినిమాల్లో కొత్త ట్రెండ్‌ను సెట్ చేసేలా ఉంటుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ అశ్వినీదత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.



# శివ వైబ్స్ క్రియేట్ చేస్తున్న నాగ్




అక్కినేని నాగార్జున నటించిన ఐకానిక్ మూవీ శివ ఇటీవలే గ్రాండ్‌గా రీరిలీజ్ అయిన విషయం తెలిసిందే. రీరిలీజ్‌లో సూపర్ రెస్పాన్స్ రాబట్టుకుంది శివ. ఇక మరోసారి శివ సినిమా నాటి వైబ్స్ క్రియేట్ చేస్తున్నాడు నాగార్జున. చైన్ బ్రాస్‌లెట్‌ను అరచేతిలో మడిచి పట్టుకున్న నాగార్జున బ్లాక్ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే గాగుల్స్‌తో స్టైలిష్‌గా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై కూర్చొని కెమెరాకు ఫోజులిచ్చాడు. అయినప్పటికీ అతడి చరిష్మా శాశ్వతమైనది.. సొగసైనది..మరపురానిది..' అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన తాజా స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆరు పదుల వయస్సు దాటినా కుర్ర హీరోలకు ఏ మాత్రం తగ్గేదేలే అంటూ తాజా స్టిల్స్‌తో చెప్పకనే చెప్పేస్తున్నాడు నాగార్జున.
ఈ ఏడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. నాగార్జున ప్రస్తుతం కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్‌పై వర్క్ చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు రా కార్తీక్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీని నాగార్జున 2026 మే నెలలో సమ్మర్ కానుకగా అభిమానుల ముందుకు తీసుకురావాలని ఎ÷–లాన్ చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలు రాగా.. నాగార్జున టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.




# పుష్పను పోలిన మలయాళీ మూవీ విలాయత్ బుద్ధ

దీంతో సంబంధం లేదన్న పృధ్వీరజ్ సుకుమారన్‌పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలో యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రం 'విలాయత్ బుద్ధ' మూవీలో పృథ్వీరాజ్ డబుల్ మోహన్ అనే పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. అందులో ఈ హీరో ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే పాత్రలో కనిపించారు. దీంతో ఈ సినిమా 'పుష్ప'ను ప్రేరణగా తీసుకొని రూపొందించారంటూ వార్తలు మొదలయ్యాయి.
తాజాగా ఆ వార్తలపై పృథ్వీరాజ్ స్పందించారు. పుష్ప సినిమా రాకముందే 'విలాయత్ బుద్ధ'ను ప్రారంభించాం. కానీ, ఈ చిత్రం రాక ఆలస్యమైంది. మేం దీని ప్రణాళికలు వేసుకున్నప్పటికి ఎర్రచందనం స్మగ్లింప్‌పై ఒక్క సినిమా కూడా రాలేదు. నిర్మాణంలో ఉందని కూడా తెలీదు. దురదృష్టవశాత్తూ 'విలాయత్ బుద్ధ' పూర్తికావడానికి ముందే పుష్ప రెండు భాగాలు వచ్చి సంచలనం సృష్టించాయి. ఈ రెండు చిత్రాలు స్మగ్లింగ్‌కు సంబంధించిన కథాంశంతో తెరకెక్కడంతో రెండూ ఒకేలా అనిపిస్తున్నాయి. కానీ, డబుల్ మోహన్ పాత్రకు పుష్పకు ఎలాంటి సంబంధం లేదని పృథ్వీరాజ్ తెలిపారు.